అక్షరశక్తి

The Power of Pen

Evening Daily

సంపుటి: 20 | సంచిక: 342 | వరంగల్ | సోమవారం, 26 అక్టోబర్ 2026 | పేజీలు: 08



“

పల్లె అనగానే పచ్చని పొలాలు, మట్టి రోడ్లు, చెరువులు, పశువుల మందలు, ఇంటి ముందు అరుగులు మాత్రమే గుర్తుకు రావు. మనుషుల మధ్య ఆప్యాయతలు, ఆత్మీయ పలకరింపులు, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే మనస్తత్వం కూడా గుర్తుకొస్తాయి. అలాంటి గ్రామీణ జీవనశైలికి ప్రతీకగా నిలిచిన వేదిక కచ్చిరి గద్దె. గ్రామ కూడలిలో, నాలుగు దారులు కలిసే చౌరస్తాలో లేదా ఊరి మధ్యభాగంలో నిర్మించిన ఈ గద్దె ఒకప్పుడు గ్రామస్తుల సామూహిక సమావేశ స్థలంగా ఉండేది. గ్రామ పెద్దలు, యువకులు, రైతులు, కూలీలు, వ్యాపారులు ఒకచోట చేరి మాట్లాడుకునే వేదికగా ఇది ఉపయోగపడేది.

కచ్చిరి గద్ది

కనుమరుగవుతున్న పల్లె సంస్కృతి

ఊరి ముచ్చట్లకు చిరునామా.. మన ఊరి కచ్చిరి గద్దె







5,6 పేజీల్లో..





-డా.పల్లె రవి వంశీ మోహన్
ఎడిటర్ & యండీ, అక్షరశక్తి



తుఫానుపై అప్రమత్తం..

విద్యుత్ సరఫరాకు పకడ్బందీ చర్యలు!

- 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- అత్యవసర మరమ్మతుల బృందాలు సిద్ధం
- విద్యుత్ సామగ్రి బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచాలి
- గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- 11 సర్కిళ్ల ఎస్ఈలతో సమీక్ష

తుఫాను తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేలా క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి 11 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సంసిద్ధతపై సమీక్షించారు.

- అక్షరశక్తి, హనుమకొండ

4



వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి



అక్షరశక్తి, వరంగల్: వెట్టిచాకిరీ నిర్మూలనకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి కె.ఆర్. నాగరాజు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త ప్రచారంలో భాగంగా సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదతో కలిసి 'స్వేచ్ఛా రథం' ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా 'మీ పని.. మీ జీవితం.. మీ స్వేచ్ఛ' గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయం, ఇటుక బట్టీలు, గనులు, క్వారీలు తదితర రంగాల్లో వెట్టిచాకిరీని గుర్తించి అరికట్టాలని, బాధితులకు రక్షణ, పునరావాసం కల్పించాలని సూచించారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంచుకోవాలని కోరారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ వెట్టిచాకిరీ బాధితులు ఫిర్యాదు చేసేందుకు బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 08069434343 గురించి విస్తృత ప్రచారం కల్పించనున్నట్లు తెలిపారు. స్వేచ్ఛా రథం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేర కార్పొరేషన్ చైర్మన్ వెంకట్రాజం, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, అదనపు కలెక్టర్ ఎల్. కిషోర్ కుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ భార్గవ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు దుగ్గొండి విద్యార్థిని
- విద్యార్థిని సన్మానించిన శానబోయిన రాజ్ కుమార్



అక్షరశక్తి, దుగ్గొండి : ఇటీవల జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ లో దుగ్గొండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థిని యాదగిరి సహస్ర 33కేజీ ల విభాగంలో రాష్ట్ర స్థాయి లో బంగారు పతకం సాధించి ఢిల్లీ లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించిన సందర్భంగా వరంగల్ జిల్లా దుగ్గొండి మండల కేంద్రంలో ని ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు రామస్వామి అధ్యక్షతన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితి గా హాజరైన రెజ్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శానబోయిన రాజ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల స్థాయి లో క్రీడల్లో రాణించడం వల్ల భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయి లో ఉంటారని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు రామస్వామి మాట్లాడుతూ దుగ్గొండి ఉన్నత పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో పతకం సాధించి కీర్తి ప్రతిష్టలు తీసుకొచ్చిన సహస్రను అభినందించిన అనంతరం శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ తోకల నర్సింహా రెడ్డి, రెజ్లింగ్ జిల్లా భాద్యులు, యాదగిరి సుధాకర్, స్థానిక సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్, ఉప సర్పంచ్ పల్లె వైష్ణవి శ్యామ్,గుండెకారి రవికుమార్, కూన రమేష్, యాదగిరి మధు కోచ్ లు కందికొండ రాజు, దేవేందర్, ఫిజికల్ డైరెక్టర్ ఐలయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



అక్షరశక్తి, హసన్‌పర్తి: హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అనంతసాగర్ ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కూలీ పనులు చేస్తున్న అమన్‌సింగ్ (21) అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన కృష్ణ ప్రతాప్ సింగ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 21న రాత్రి కళాశాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్ నుంచి వెళ్లిన అమన్‌సింగ్ తిరిగి రాలేదని, 22వ తేదీ నుంచి అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. అదృశ్యమైన యువకుడి ఎత్తు సుమారు 5.5 అడుగులు కాగా, నల్లరంగు టీషర్ట్, నెక్కర్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసినవారు హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ 8712685124, ఎస్ఐ 8712685097, 8712685098, పోలీస్‌స్టేషన్ 8712685015 నంబర్లకు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని కోరారు.

యూనియన్ బలోపేతానికి కృషి చేయాలి

- ఐఎన్టియుసి అనుబంధ
- 327రాష్ట్ర సెక్రెటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్



అక్షరశక్తి, హనుమకొండ: యూనియన్ బలోపేతానికి కార్మికులందరూ కృషి చేయాలని ఐఎన్టీయూసీ అనుబంధ 327 యూనియన్ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కోరారు. సోమవారం ఐఎన్టియుసి అనుబంధతెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ నగరంలోని పలు సబ్స్టేషన్ల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని యూనియన్ నాయకులతోపాటు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కంపెనీ అధ్యక్షులు పి మహేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ 73 సంవత్సరాలుగా యూనియన్ నిబలోపేతం చేస్తూ కార్మికుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించి కార్మికుల హక్కులను సాధించిపెట్టిన ఘనత 327 యూనియన్ కి దక్కిందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. కార్మికులకు హక్కులను సాధించి పెట్టడంలో ఎన్నో రాజీలేని పోరాటాలను నిర్వహించి వాటిని సాధించామని ఆయన తెలిపారు. అధికార పక్షంగా ఉన్న, ప్రతిపక్షంగా ఉన్న ఎటువంటి పక్షపాతానికి తావు లేకుండా కార్మికుల పక్షపాతిగా యూనియన్ ను బలోపేతం చేస్తూ కార్మికుల హక్కులను సాధించుకున్నామన్నారు. గతంలో బిఆర్ఎస్ గవర్నమెంట్ ఉన్న కార్మికుల హక్కుల కోసం ఐక్య ఫ్రంట్ గా ఏర్పడి విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న 23,000 మంది అవుట్ సోర్స్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించడంలో 327 యూనియన్ పాత్ర కీలకమైంది అన్నారు. విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు హక్కుల సాధన కోసం యాజమాన్యాలతో పోరాటం నిర్వహించి వారి హక్కులను సాధించి పెట్టామన్నారు. కార్మికులకు అందుబాటులో ఉంటూ తమ సంఘ నాయకులు హక్కులను సాధించి పెట్టడంలో కీలక భూమిక పోషించారన్నారు. రానున్న పిఆర్సి కోసం అన్ని సంఘాల నాయకులు చేసి పవర్ జేఏసీ ఏర్పాటు చేయించి కార్మికుల హక్కులను పి ఆర్ సి ని సాధించేందుకు విరోచిత పోరాటాన్ని నిర్వహించేందుకు కూడా 327 యూనియన్ సిద్ధంగా ఉందని ఆయన తెలిపారు. ఎన్పీడీసీఎల్ లో పనిచేస్తున్న అన్మాండ్ కార్మికులను ఆర్టిజన్లుగా గుర్తించేందుకు ప్రభుత్వంతో యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామని త్వరలోనే వారికి కూడా తీపి కబురు అందిస్తామని ఈ సందర్భంగా శ్రీధర్ తెలిపారు. ఆర్టిజన్ కార్మికులకు రావలసిన అన్ని హక్కులను ఇప్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. రెగ్యులర్ ఉద్యోగులకు ఏవైతే హక్కులు ఉన్నాయో ఆర్టిజన్ కార్మికులకు కూడా అవే హక్కులు లభించేలా యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నామన్నారు. ఏపీఎస్సీబీ సర్వీస్ రూల్స్ అందించే వరకు ఆర్టిజన్ కార్మికులకు అండగా ఉండి పోరాట నిర్వహించి ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్సీబీ సర్వీస్ రూల్స్ అందిస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కార్మికులు ఏ సమస్య వచ్చినా 327 యూనియన్ వారికి అండగా ఉంటుందని వారి సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ముందు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్ , హనుమకొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిట్ల ఓదేలు, ధోని కల సదయ్య, వరంగల్ జిల్లా కార్యదర్శి మచ్చిక బుచ్చయ్య గౌడ్, హనుమకొండ టౌన్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు సునీల్ కుమార్, ఉమేష్ కుమార్ పాల్గొన్నారు.

దండు సమ్మయ్య కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం

మాదన్నపేటలో కమ్యూనిస్టు కార్యకర్తకు నివాళులర్పించిన బీసీ సంఘం నాయకులు



ఆర్థిక సహాయం చేస్తున్న పీఆర్ ముదిరాజ్ సేవా సమితి సేవకులు

అక్షరశక్తి, నర్సంపేట: నర్సంపేట మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన కమ్యూనిస్టు కార్యకర్త దండు సమ్మయ్య ముదిరాజ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణవార్త తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, పీఆర్ ముదిరాజ్ సేవా సమితి రాష్ట్ర నాయకుడు సింగారపు రామకృష్ణ ముదిరాజ్ గ్రామానికి చేరుకుని సమ్మయ్య మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. పెసరు రాజన్న అందించిన సహకారంతో, గ్రామ కుల పెద్దలు దండు రామునర్సయ్య, జల్లి ఐలయ్య ముదిరాజ్ సమక్షంలో బాధిత కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ.5,000 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్, సింగారపు రామకృష్ణ ముదిరాజ్ మాట్లాడుతూ, నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, సమాజంలోని పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న పెసరు రాజన్నకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, మాదన్నపేట ముదిరాజ్ కుల పెద్దలు, బంధువులు బాధిత కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సహాయం అందించడం సమాజ ఐక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దండు రామునర్సయ్య, జల్లి ఐలయ్య, దండు రవి, పోలేబోయిన ఆనంద్, దండు రమేష్, గిన్నె వెంకటయ్య, దండు రమేష్ బాబు, దండు తిరుపతి, గొర్రె ప్రభాకర్, దండు చిరంజీవి, ముదిరాజ్ సేవకులు, దండు సమ్మయ్య కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్ట్ జిల్లా కమిటీ



అక్షరశక్తి,ములుగు: ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవ్ రావ్ ను తెలంగాణ జర్నలిస్ట్ అసోసియేషన్ (TJA) ములుగు జిల్లా కమిటీ సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారు జిల్లా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేయటం తోపాటు శాలువాలతో సన్మానించారు. అనంతరం తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ ములుగు జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడారు.జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కొరకు సహకరించాలని వారు కలెక్టర్ ను కోరారు. దీంతో కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు TJA నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో TJA ములుగు జిల్లా అధ్యక్షులు బేతి సతీష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఎనగందుల కొమురయ్య, గౌరవ అధ్యక్షులు ఎర్రం స్వామి, ఉపాధ్యక్షుడు చల్లగురుగుల రాజు, సంయుక్త కార్యదర్శి గట్టు ప్రశాంత్ గౌడ్, కమిటీ సభ్యుడు బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది అప్రమత్తం

- అత్యవసర మరమ్మతులకు సామగ్రి సిద్ధం
- టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడి



అక్షరశక్తి, హనుమకొండ: తుఫాను ప్రభావంతో ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు భారీ వర్షాలు, ఈదురుగాలుల ఉన్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయాలు ఏర్పడకుండా క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి సంబంధిత సర్కిళ్ల ఎస్ఈలను ఆదేశించారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్,వరంగల్, మహబూబాబాద్, పెద్దపల్లి జిల్లాలతో పాటు కరీంనగర్, హనుమకొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలపై తుఫాను ప్రభావం ఉండే అవకాశం ఉన్నందున సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా ముందస్తుగా సిబ్బందిని అప్రమత్తం చేసి, అత్యవసర మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని తెలిపారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ స్తంభాలు, లైన్లు, ట్రాన్స్ఫార్మర్లు నెలకొరగడం చేత ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టేందుకు వాహనాలు, ఏజెన్సీలు విద్యుత్ పరికరాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అప్రమత్తంగా ఉంచి, క్షేత్రస్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ప్రజలకు సాధ్యమైనంతవరకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, విద్యుత్ ప్రమాదాలు జరగకుండా భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయాలు, సరఫరాకు సంబంధించిన ఫిర్యాదుల కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని వినియోగదారులకు సూచించారు. వర్షాలు, ఈదురుగాలుల సమయంలో తెగిపడిన విద్యుత్ తీగలను తాకరాదని వాటికి దూరంగా ఉండి వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న జిల్లాల్లో అన్ని సత్వర చర్యలు చేపట్టాలని సూచించారు.

అత్యవసర మరమ్మతులకు సిబ్బంది, సామగ్రి సిద్ధం

అన్ని సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్లు, సెక్షన్లలో అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసి, అత్యవసర మరమ్మతులకు అవసరమైన సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్‌లు, క్షేత్రస్థాయి సమన్వయం

సర్కిల్, డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను అందుబాటులో ఉంచి, ఫిర్యాదులను ఎప్పటికప్పుడు నమోదు చేసి పరిష్కరించాలని సూచించారు. అధికారులు,సిబ్బంది షిఫ్టులవారీగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ అంతరాయాలు, మరమ్మతులు, సరఫరా పునరుద్ధరణకు సంబంధించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని స్పష్టం చేశారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు బంగారు పతకాల ప్రదానం

- అన్ని రంగాల్లో రాణించాలి.. రాష్ట్ర అధ్యక్షుడు గట్టు మహేష్‌బాబు



అక్షరశక్తి, హనుమకొండ: ఆర్యవైశ్యులు స్వయంకృషితో అన్ని రంగాల్లో రాణించాలని ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు మహేష్‌బాబు అన్నారు. ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆవోపా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ కోర్సుల్లో ప్రతిభ కనబరిచిన 45 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేశారు. విద్యార్థులకు శాలువాలు కప్పి, మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. తొలుత వాసవీమాత చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. జిల్లా అధ్యక్షుడు దొంతుల ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గట్టు మహేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు.ప్రతిభావంతులను ప్రోత్సహిస్తున్న ఆవోపా జిల్లా కమిటీని అభినందించారు. ప్రముఖ సైకాలజిస్ట్, యంగ్ మోటివేటర్ డాక్టర్ బరుపాటి గోపి మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తుందని అన్నారు. ధనం సౌకర్యాలు కల్పిస్తుందని, విద్య జ్ఞానాన్ని అందిస్తుందని, అయితే ఆత్మనియంత్రణ లేకపోతే అవన్నీ వ్యర్థమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కమటాల భాస్కర్‌రావు, ఆర్థిక కార్యదర్శి గంప సతీష్, జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్ కాంత్, విద్యా కమిటీ చైర్మన్ డాక్టర్ గన్ను నటరాజ శేఖర్, సభ్యులు రవ్వ రమేష్, పుల్లూరి మల్లికార్జున్, కామిశెట్టి సత్యనారాయణ, డాక్టర్ జి. రజిత, కళా రాజేశ్వర్‌రావు, కందికొండ శ్రీనివాస్, అంజనీదేవి, గోల్డ్ మెడల్ సివిల్స్ డోనర్ తోట పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేయాలి

- మడికొండ ఎన్రోల్మెంట్ కేంద్రాన్ని సందర్శించిన డా. వన్నాల వెంకటరమణ



అక్షరశక్తి, కాజీపేట(మడికొండ): నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించాలని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ రాష్ట్ర కోఇన్‌చార్జి డా. వన్నాల వెంకటరమణ సూచించారు. మడికొండలో జిల్లా కార్యదర్శి పోనగోటి వెంకట్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న నమోదు ప్రక్రియను పరిశీలించి, ఇప్పటివరకు నమోదైన పట్టభద్రుల వివరాలు, నమోదు పురోగతి, క్షేత్రస్థాయిలో కార్యకర్తలు చేపడుతున్న కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటరు నమోదు కీలకమని పేర్కొంటూ, అర్హత ఉన్న ఏ ఒక్క పట్టభద్రుడి వివరాలు కూడా నమోదు కాకుండా మిగిలిపోకూడదన్నారు. నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని, పట్టభద్రులను నేరుగా కలిసి అవసరమైన వివరాలు సేకరించి, నిర్దిష్ట గడువులోగా నమోదు పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా కార్యకర్తలు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ జిల్లా కోకన్వీనర్ త్రిలోకేశ్వర్‌రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర నాయకుడు గడ్డం మహేందర్, ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ మడికొండ కన్వీనర్ మిట్టపల్లి హేమంత్, చేన్న బోయిన శివకుమార్, నాయిని కుమార్, మారం రాము యాదవ్, దార ధనుంజయ్, తాడేం రంజిత్, గుండాల కళ్యాణ్, బైరి సతీష్, అన్నందాస్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

బాణాసంచా విక్రయాలకు నవంబర్ 2లోపు దరఖాస్తు చేసుకోవాలి



వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత

అక్షరశక్తి, వరంగల్: దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలనుకునే వారు అనుమతుల కోసం నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డీసీపీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ), స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్టీ నమోదు ధ్రువపత్రం, గతంలో లైసెన్స్ పొందినట్లయితే దాని ప్రతిని జతచేయాలి. అవసరమైన చోట్ల పక్క స్థలాల యజమానుల అనుమతి పత్రాలతో పాటు స్థల ప్రణాళిక (సైట్ ప్లాన్) సమర్పించాలి. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించిన బ్యాంకు చలాన్‌ను దరఖాస్తుతో పాటు జతచేయాలని సూచించారు. అందిన దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత డీసీపీ స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు చేస్తారని కమిషనర్ వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలి



అక్షరశక్తి,హనుమకొండ: ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే నీటి ఎద్దడిని నివారించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ సూచించారు. హనుమకొండలోని లోక్‌సత్తా కార్యాలయంలో సుంకరి ప్రశాంత్ అధ్వర్యంలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, జ్వాల అవినీతి వ్యతిరేక సంస్థ సంయుక్తంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ విమర్శలకు తావివ్వకుండా అఖిలపక్ష నాయకులు, మేధావుల సూచనలతో ప్రభుత్వం ముందుకు సాగాలని కోరారు. గోదావరి, ప్రాణహిత నదుల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించుకొని రిజర్వాయర్లను నింపడం ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలను తీర్చాలని సూచించారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నుల ఆదాయాన్ని అనవసర ఖర్చులకు కాకుండా మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాలని అన్నారు. రాష్ట్రంలో మద్యం విక్రయాల ద్వారా వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగినప్పటికీ, ప్రజల ప్రాథమిక అవసరాలు పూర్తిస్థాయిలో ఎందుకు తీరడం లేదని జయప్రకాష్ నారాయణ ప్రశ్నించారు. రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో మద్యం ఆదాయం సుమారు రూ.10 వేల కోట్లు ఉండగా, ప్రస్తుతం రూ.42 వేల కోట్లకు చేరిందని పేర్కొంటూ, ఆ ఆదాయాన్ని ఎలా వినియోగిస్తున్నారో ప్రభుత్వం స్పష్టం చేయాలని కోరారు. యువత మద్యం, మాదకద్రవ్యాలకు అలవాటు పడకుండా చర్యలు చేపట్టాలని, రాజకీయ, ఎన్నికల, న్యాయ, పోలీసు వ్యవస్థల్లో సంస్కరణలు అమలు చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవకులేనని స్పష్టం చేశారు. సమావేశంలో లోక్‌సత్తా రాష్ట్ర ప్రధాన సలహాదారు పర్చా కోదండ రామారావు, ఉభయ తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త బండారు రామ్మోహనరావు, సుంకరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం





అక్షరశక్తి, భూపాలపల్లి, అక్టోబరు 26: విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సోమవారం భూపాలపల్లిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీని అదనపు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. జయశంకర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు సేవలందించడమే వారికి అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు రత్నం, సంతోష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుకు కృషి చేయాలి



అక్షరశక్తి, హన్మకొండ(వడ్డేపల్లి): అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. సోమవారం 60వ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో పట్టభద్రులను కలిసి ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైన వారికి ఫారం 18 అందజేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని సూచించారు. పట్టభద్రుల ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం నిర్వహించి అర్హులందరూ జాబితాలో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని పార్టీ శ్రేణులకు ఇప్పటికే సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల డివిజన్ ఇన్‌చార్జి రఘు, ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ బాధ్యుడు జనార్దన్, డివిజన్ సీనియర్ నాయకుడు తోట నవీన్, విజయపాల్ కాలనీ బీఎల్ఏ విష్ణు, టీచర్స్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి

అక్షరశక్తి, భూపాలపల్లి, అక్టోబరు 26: మహర్షి వాల్మీకి రచనలు సత్యం, ధర్మం, న్యాయం, మానవతా విలువలను తరతరాలకు చాటిచెబుతున్నాయని అదనపు ఎస్పీ నరేష్ కుమార్ అన్నారు. సోమవారం భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. రామాయణ మహాకావ్యాన్ని రచించిన ఆదికవి మహర్షి వాల్మీకి భారతీయ సంస్కృతి, సాహిత్య చరిత్రలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని నైతిక విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఐలు సంతోష్, రత్నం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



తుఫానుపై అప్రమత్తం..

విద్యుత్ సరఫరాకు పకడ్బందీ చర్యలు!

- 24 గంటల కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి
- అత్యవసర మరమ్మతుల బృందాలు సిద్ధం
- విద్యుత్ సామగ్రి బఫర్ స్టాక్ అందుబాటులో ఉంచాలి
- గోదావరి పరివాహక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి
- 11 సర్కిళ్ల ఎస్ఈలతో సమీక్ష

అక్షరశక్తి, హనుమకొండ, అక్టోబరు 26: తుఫాను తీవ్రత దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వినియోగదారులకు అసౌకర్యం కలగకుండా విద్యుత్ సరఫరాను సాధ్యమైనంత త్వరగా పునరుద్ధరించేలా క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం హనుమకొండ నక్కలగుట్టలోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి 11 సర్కిళ్ల సూపరింటెండింగ్ ఇంజినీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా సంసిద్ధతపై సమీక్షించారు. ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, వరంగల్, మహబూబాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, హనుమకొండ సర్కిళ్ల పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సర్కిల్, డివిజన్, సబ్ డివిజన్ స్థాయిల్లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సంబంధిత అధికారులు హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశించారు.



మరమ్మతులకు ప్రత్యేక బృందాలు

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే వెంటనే స్పందించేందుకు శాఖాపరమైన బ్రేక్‌డౌన్ గ్యాంగ్‌లతో పాటు ఏజెన్సీ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సీఎండీ సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్‌టీ) వాహనాలను మోహరించాలని ఆదేశించారు. డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్), విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, ఇన్సులేటర్లు తదితర సామగ్రిని తగినంత బఫర్ స్టాక్‌గా అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. తుఫాను కారణంగా స్తంభాలు కూలడం, విద్యుత్ లైన్లు దెబ్బతినడం, ట్రాన్స్‌ఫార్మర్లలో సమస్యలు తలెత్తడం వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిబ్బంది, వాహనాలు, సామగ్రితో సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు.

గోదావరి పరివాహక ప్రాంతాలపై నిఘా

తుఫాను ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్న గోదావరి పరివాహక ప్రాంతాల్లో నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని వరుణ్‌రెడ్డి సూచించారు. కార్పొరేట్ కార్యాలయంలోని లోడ్ మానిటరింగ్ సెల్ ద్వారా విద్యుత్ సరఫరా, లోడ్ పరిస్థితులు, అంతరాయాలు, మరమ్మతుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వారీగా లోడ్, సరఫరా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, విద్యుత్ లైన్ల ఇంటర్‌లింకింగ్ సదుపాయాలను వినియోగించుకోవాలని చెప్పారు. ఏదైనా లైన్ లేదా ఫీడర్ దెబ్బతిన్నప్పుడు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

సమన్వయంతో పనిచేయాలి

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు అన్ని స్థాయిల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎండీ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. వినియోగదారులకు ఇబ్బందులు తగ్గించేలా విద్యుత్ సరఫరాను వీలైనంత త్వరగా పునరుద్ధరించడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డైరెక్టర్లు వి. మోహన్‌రావు, వి. తిరుపతిరెడ్డి, సి. ప్రభాకర్, చీఫ్ ఇంజినీర్లు కె. తిరుమల్‌రావు, అశోక్, సురేందర్, గౌతమ్‌రెడ్డి, అన్నపూర్ణ, నాగప్రసాద్, జనరల్ మేనేజర్లు మధుసూదన్, శ్రీనివాస్, విజేందర్‌రెడ్డి, బాబురావు, అన్నపూర్ణ, వాసుదేవ్, తిరుపతి, డీఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు కొమరం భీమ్

అక్షరశక్తి, కేయూ క్యాంపస్ : ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన కొమరం భీమ్ వారి ఆరాధ్య దైవమని కాకతీయ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. విశ్వవిద్యాలయ పరిపాలనా భవన ప్రాంగణంలో ఎస్సీ/ఎస్టీ సెల్ సంచాలకుడు డాక్టర్ ఎ.రాజు అధ్యక్షతన నిర్వహించిన కొమరం భీమ్ 86వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిజాం పాలనకు వ్యతిరేకంగా భీమ్ సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఎస్సీ, ఎస్టీల హక్కులు, వాటి పరిరక్షణకు సంబంధించిన చట్టాలపై అవగాహన కల్పించేందుకు ఉపకులపతి ఆదేశాల మేరకు ప్రత్యేక సెమినార్ నిర్వహిస్తామని తెలిపారు. ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి మాట్లాడుతూ 'జల్, జంగిల్, జమీన్' నినాదం ఆదివాసీల జీవన హక్కులతోపాటు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తుచేస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ మాట్లాడుతూ ఆదివాసీలకు చట్టబద్ధమైన హక్కులు పూర్తిస్థాయిలో అందడం లేదన్నారు. 1/70 చట్టం ద్వారా ఆశించిన ప్రయోజనాలు కూడా పూర్తిగా అందడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులు ఆదివాసీల హక్కులు, సంబంధిత చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు ఆచార్య బి. సురేష్ లాల్, డాక్టర్ చిర్రా రాజు, ఆచార్య హనుమంత్, ఆచార్య వై. వెంకయ్య, ఆచార్య ఎన్. ప్రసాద్, డాక్టర్ నాగరాజు, డాక్టర్ పుల్లా శ్రీనివాస్, పలువురు అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కొమరం భీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



రేపటి నుంచి కేయూ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు

సుబేదారి కళాశాలలో 29 వరకు నిర్వహణ

అక్షరశక్తి, హనుమకొండ: కాకతీయ విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల పురుషుల క్రీడా పోటీలు (2026-27, ఫేజ్ II) ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించనున్నట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ఈ నెల 27న ఉదయం 8 గంటలలోపు కళాశాలకు చేరుకోవాలని, ప్రారంభోత్సవానికి తమ కళాశాల జెండాతో హాజరుకావాలని సూచించారు. ప్రారంభోత్సవానికి వైస్ ఛాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రతి జట్టు మ్యాచ్ ప్రారంభానికి 15 నిమిషాల ముందు సంబంధిత సెక్షన్ కార్యదర్శికి రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే జట్లకు ఈ నెల 26వ తేదీ సాయంత్రం నుంచి వసతి కల్పిస్తామని, ముందస్తు సమాచారం ఇస్తే క్యాంటీన్‌లో చెల్లింపు ప్రాతిపదికన భోజన సదుపాయం కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 28న ఉదయం 6 గంటలకు క్రాస్ కంట్రీ రేసు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనే క్రీడాకారులు మెడికల్ సర్టిఫికెట్, క్రీడా షూలు తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఏ.టి.బి.టి. ప్రసాద్‌ను 98492 06310 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కచ్చిరి గద్ది

కనుమరుగవుతున్న పల్లె సంస్కృతి

'కచ్చిరి' అంటే కార్యాలయం, సభ లేదా విచారణ జరిగే స్థలం. 'గద్దె' అంటే ఎత్తుగా నిర్మించిన వేదిక లేదా పీఠం. ఈ రెండు పదాల కలయికతో ఏర్పడిన కచ్చిరి గద్దె గ్రామ జీవితంలో సమాచార మార్పిడికి, సామాజిక చర్చలకు, ప్రజల మధ్య సంబంధాల బలోపేతానికి కేంద్రంగా నిలిచింది.

ఊరి సమాచారానికి కేంద్రం

సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అందుబాటులోకి రాకముందు, ముఖ్యంగా 1990వ దశకం వరకు, గ్రామీణ ప్రాంతాల్లో కచ్చిరి గద్దెలకు ప్రత్యేక స్థానం ఉండేది. రేడియో, టెలివిజన్ వంటి సమాచార సాధనాలు అందరికీ అందుబాటులో లేని రోజుల్లో గ్రామంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలంటే గద్దె దగ్గరకు వెళితే సరిపోయేది.

ఎవరి ఇంట్లో పెళ్లి సంబంధం కుదిరింది? ఎవరి కొడుకుకు ఉద్యోగం వచ్చింది? ఎవరి పొలంలో పంట బాగా పండింది? ఊరికి కొత్తగా ఎవరు వచ్చారు? ఏ కుటుంబంలో శుభకార్యం జరగబోతోంది? ఇలాంటి విషయాలు అక్కడ చర్చకు వచ్చేవి. ఒకరి ద్వారా మరొకరికి సమాచారం చేరి, క్రమంగా ఊరంతా తెలిసేది. అది కేవలం వార్తలు చెప్పుకునే చోటు మాత్రమే కాదు. గ్రామ ప్రజల జీవితాలను ఒకదానితో మరొకటి అనుసంధానించిన సామాజిక వ్యవస్థ. నేటి సామాజిక మాధ్యమాల మాదిరిగా సమాచారాన్ని వేగంగా పంచుకోకపోయినా, ముఖాముఖి మాటల ద్వారా మనుషులను దగ్గర చేసిన వేదిక.

సాయంత్రం సందడి

పల్లెటూరి దినచర్యలో సాయంత్రానికి ఒక ప్రత్యేకత ఉండేది. రోజంతా పొలాల్లో పనిచేసిన రైతులు, కూలీలు, పశువులను మేపి వచ్చిన కాపరులు, తమ పనులు ముగించుకున్న వ్యాపారులు ఇంటికి చేరి కాసేపు విశ్రాంతి తీసుకునేవారు. ఆ తర్వాత కచ్చిరి గద్దె వైపు అడుగులు వేసేవారు. సాయంత్రం ఆరు గంటలు దాటేసరికి ఒక్కొక్కరుగా చేరే మనుషులతో గద్దె కళకళలాడేది. ఎవరో ఒకరు ముందుగా కూర్చొని ఉంటే, మరొకరు వచ్చి పలకరించేవారు. రోజంతా

ఊరి ముచ్చట్లకు చిరునామా మన ఊరి కచ్చిరి గద్దె

జరిగిన సంగతులను చెప్పుకుంటూ,నవ్వులు పంచుకుంటూ సమయం గడిపేవారు. అక్కడికి రావడానికి ప్రత్యేక ఆహ్వానం అవసరం లేదు. ఎవరైనా రావచ్చు, తమకు తెలిసిన వారితో కాసేపు కూర్చొని మాట్లాడవచ్చు. రోజూ కనిపించే వ్యక్తి ఒకరోజు రాకపోతే అతని గురించి ఆరా తీసేవారు. వరుసగా కొన్ని రోజులు కనిపించకపోతే ఇంటికి వెళ్లి పలకరించే ఆత్మీయత కూడా ఉండేది.

అరుగు నుంచి అంతరిక్షం దాకా..

కచ్చిరి గద్దె దగ్గర జరిగే ముచ్చట్లకు హద్దులుండేవి కావు. ఇంటి అరుగు నుంచి అంతరిక్షం దాకా, ఊరి నుంచి అమెరికా దాకా ఏ విషయమైనా చర్చకు వచ్చేది. వ్యవసాయం, వర్షా లు, పంటలు, రాజకీయాలు, సినిమాలు, క్రీడలు, బంధుత్వాలు, పెళ్లిళ్లు, పండుగలు.. ఇలా ఎన్నో అంశాలు మాటల్లో దొర్లేవి.

ఆకాశవాణిలో విన్న వార్తలను ఒకరు చెబితే, మరొకరు తమ అభిప్రాయాలను జోడించేవారు. బ్లాక్ అండ్ వైట్ టీవీలో చూసిన సినిమాల కథలను గుర్తు చేసుకునేవారు. ఎడ్లబండి కట్టుకుని టూరింగ్ టాకీసుకు వెళ్లిన రోజుల గురించి సరదాగా చెప్పుకునేవారు. హీరోల నటన, పాటలు, సినిమాల్లోని సన్నివేశాలు చర్చిస్తూ గంటల తరబడి గడిపేవారు.

బంధువుల పెళ్లిళ్లలో జరిగిన సరదా సంఘటనలు, జాతరల సందడి, పండుగల విశేషాలు, పొరుగూరికి వెళ్లినప్పుడు ఎదురైన అనుభవాలు కూడా ముచ్చట్లలో భాగమయ్యేవి. పెద్దలు చెప్పే పాతకాలపు కథలు, సామెతలు యువతకు వినోదంతో పాటు జీవితానుభవాన్ని అందించేవి.

రాజకీయాల గురించి మాట్లాడే బృందాలు కొన్ని ఉంటే, సరదాగా పిచ్చాపాటి కబుర్లు చెప్పుకునే బృందాలు మరికొన్ని ఉండేవి. ఒక్కోసారి చిన్న విషయమే పెద్ద చర్చకు దారితీసేది. మాటల్లో చమత్కారం, మధ్య మధ్యలో నవ్వులు, వాదోపవాదాలు.. ఇలా గద్దె దగ్గరి సమయం ఎప్పుడు గడిచిపోయేదో తెలిసేది కాదు.



పల్లె అనగానే పచ్చని పొలాలు, మట్టి రోడ్లు, చెరువులు, పశువుల మందలు, ఇంటి ముందు అరుగులు మాత్రమే గుర్తుకు రావు. మనుషుల మధ్య ఆప్యాయతలు, ఆత్మీయ పలకరింపులు, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే మనస్తత్వం కూడా గుర్తుకొస్తాయి. అలాంటి గ్రామీణ జీవనశైలికి ప్రతీకగా నిలిచిన వేదిక కచ్చిరి గద్దె. గ్రామ కూడలిలో, నాలుగు దారులు కలిసే చౌరస్తాలో లేదా ఊరి మధ్యభాగంలో నిర్మించిన ఈ గద్దె ఒకప్పుడు గ్రామస్తుల సామూహిక సమావేశ స్థలంగా ఉండేది. గ్రామ పెద్దలు, యువకులు, రైతులు, కూలీలు, వ్యాపారులు ఒకచోట చేరి మాట్లాడుకునే వేదికగా ఇది ఉపయోగపడేది.

సామాజిక వ్యవహారాలకు వేదిక

పూర్వకాలంలో గ్రామాల్లో నేటి తరహా పంచాయతీ వ్యవస్థ, ప్రభుత్వ కార్యాలయాలు విస్తృతంగా అందుబాటులో లేని పరిస్థితుల్లో గ్రామ పెద్దలు సామాజిక వ్యవహారాల్లో ముఖ్యమైన పాత్ర పోషించేవారు. కొన్ని గ్రామాల్లో కచ్చిరి గద్దె వద్ద సమావేశమై ప్రజల సమస్యలను చర్చించి, వివాదాలను పరిష్కరించేందుకు ప్రయత్నించేవారు. భూముల హద్దులు, నీటి పంపకాలు, అప్పుల లావాదేవీలు, కుటుంబ కలహాలు, గ్రామ కట్టుబాట్లకు సంబంధించిన వివాదాలపై ఇరువైపుల వారిని కూర్చోబెట్టి మాట్లాడించేవారు. పెద్దల అనుభవం, సమాజంలో వారికి ఉన్న గౌరవం ఆధారంగా రాజీ కుదిర్చేందుకు ప్రయత్నాలు జరిగేవి.

స్వాతంత్ర్యానంతరం కూడా కొన్ని ప్రాంతాల్లో ఇలాంటి సంప్రదాయ సమావేశాలు కొనసాగాయి. అయితే ఆ కాలపు గ్రామీణ వ్యవస్థలో కుల ఆధారిత వివక్ష, సామాజిక అసమానతలు కూడా ఉండేవి. కాబట్టి కచ్చిరి గద్దె చరిత్రలోని సామూహికతను గుర్తుచేసుకుంటూనే, నేటి సమాజంలో



సమానత్వం, న్యాయం, మానవ గౌరవం వంటి విలువలకు ప్రాధాన్యం ఇవ్వడం అవసరం.

కాలక్రమంలో పంచాయతీ వ్యవస్థ బలోపేతం కావడం, ప్రభుత్వ కార్యాలయాలు గ్రామాలకు చేరడం వల్ల పరిపాలనా వ్యవహారాలు అధికారిక వ్యవస్థల పరిధిలోకి వెళ్లాయి. దీంతో కచ్చిరి గద్దె ప్రధానంగా సామాజిక సమావేశాలకు, వినోదానికి, ముచ్చట్లకు వేదికగా మారింది.

గద్దె చుట్టూ ఆత్మీయ బంధాలు

కచ్చిరి గద్దె ప్రత్యేకత అక్కడి నిర్మాణంలో కాదు.. అక్కడ కలిసే మనుషుల మధ్య ఉండే అనుబంధాల్లో ఉంది. ఒకరినొకరు అన్నా, తమ్ముడూ, బాబాయ్, మామయ్య, అక్కా, వదినా అంటూ వరుసలతో పిలుచుకునేవారు. రక్తసంబంధం లేకపోయినా బంధుత్వాన్ని పంచుకునే సంస్కృతి పల్లెల్లో బలంగా కనిపించేది. ఒక ఇంట్లో పెళ్లి జరిగితే ఊరంతా పనుల్లో పాలు పంచుకునేది. ఎవరికైనా అనారోగ్యం వస్తే పలకరించేవారు. కష్టకాలంలో చేతనైన సాయం చేసేవారు. పంట కోతల సమయంలో, ఇళ్ల నిర్మాణంలో, పండుగల్లో పరస్పరం సహకరించుకునేవారు.


కుటుంబాల్లో చిన్నపాటి మనస్పర్థలు వచ్చినప్పుడు అనుభవజ్ఞులైన పెద్దలు సలహాలు ఇచ్చేవారు. యువతకు చదువు, ఉద్యోగం, వ్యవసాయం వంటి విషయాల్లో మార్గనిర్దేశం చేసేవారు. గద్దె దగ్గర ఏర్పడిన పరిచయాలు కాలక్రమంలో స్నేహాలుగా మారి, అవసరమైనప్పుడు ఒకరికొకరు అండగా నిలిచే బంధాలుగా ఎదిగేవి.

గద్దె చుట్టూ పల్లె జీవనం

కొన్ని గ్రామాల్లో కచ్చిరి గద్దె సమీపంలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పాల సేకరణ కేంద్రం, తాగునీటి బోరు వంటి సదుపాయాలు ఉండేవి. దీంతో గ్రామస్తులు సహజంగానే ఆ ప్రాంతంలో తరచూ కలుసుకునేవారు.

బోరు దగ్గర నీళ్లు పట్టుకుంటూ





మహిళలు ఇంటి విశేషాలు చెప్పుకునేవారు. పాల కేంద్రం వద్ద రైతులు పాల ధరలు, పశుపోషణ గురించి మాట్లాడుకునేవారు. గద్దె దగ్గర యువకులు, గ్రామ పెద్దలు, రైతులు తమ తమ అనుభవాలను పంచుకునే వారు.

గ్రామానికి కొత్తగా వచ్చిన వ్యక్తికి దారి చెప్పాలన్నా, ఏదైనా సమాచారం తెలుసుకోవాలన్నా గద్దె దగ్గర ఉన్నవారిని అడిగితే సరిపోయే రోజులు ఉండేవి. ఆ ప్రాంతం గ్రామానికి ఒక గుర్తింపుగా నిలిచేది. గ్రామంలోని వివిధ వర్గాల ప్రజలు ఒకరినొకరు కలుసుకునే సహజమైన కూడలిగా అది ఉపయోగపడేది.

తరం మారింది..

పల్లె ముఖచిత్రం మారింది!

విద్యావకాశాలు పెరగడం, ఉపాధి కోసం పట్టణాలకు వలసలు పెరగడం, రవాణా సౌకర్యాలు మెరుగు పడడం, సాంకేతిక విప్లవం రావడం వంటి పరిణామాలు గ్రామీణ జీవనశైలిని మార్చేశాయి. ఒకప్పుడు గ్రామంలోనే వ్యవసాయం చేసుకుంటూ తరతరాలుగా జీవించిన కుటుంబాల్లో చాలామంది చదువు, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లసాగారు. రేడియో స్థానంలో టెలివిజన్, ఆ తర్వాత సెల్‌ఫోన్లు, అంతర్జాలం, సామాజిక మాధ్యమాలు వచ్చాయి. ఒకప్పుడు ఊరి వార్త తెలుసుకోవడానికి కచ్చిరి గద్దెకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ప్రపంచంలోని ఏ మూలన ఏం జరిగినా క్షణాల్లో తెలుసుకునే అవకాశం ఉంది. అయితే సమాచార సాధనాలు పెరిగినా, ఒకచోట కూర్చొని ముఖాముఖిగా మాట్లాడుకునే సమయం తగ్గిపోయింది. గతంలో పారుగింటి వారితో సహజంగా ఏర్పడే పరిచయాలు, సాయంత్రపు సమావేశాలు, పెద్దల అనుభవాలను వినే అవకాశాలు నేటి జీవన వేగంలో కొంతవరకు కనుమరుగయ్యాయి.

అమ్మమ్మల తరం..
చెరిగిపోని జ్ఞాపకాలు

ఒకప్పుడు గద్దె దగ్గర కూర్చొని కబుర్లు చెప్పిన పెద్దల్లో చాలామంది నేడు మన మధ్య లేరు. వారితో పాటు వారి అనుభవాలు, చమత్కారాలు, సామెతలు, పాతకాలపు కథలు కూడా క్రమంగా మరుగున పడుతున్నాయి. అమ్మమ్మలు చెప్పిన కథలు, తాతయ్యలు పంచుకున్న అనుభవాలు, ఇంటి అరుగు పై సేదతీరిన సాయంత్రాలు, స్నేహితులతో కచ్చిరి గద్దె దగ్గర గడిపిన క్షణాలు ఒక తరానికి చెరిగిపోని జ్ఞాపకాలు.

ఆ రోజుల్లో సౌకర్యాలు తక్కువగా ఉన్నా, మనుషుల మధ్య పరిచయాలు ఎక్కువగా ఉండేవి. ఒకరి జీవితంలో జరిగే ముఖ్యమైన విషయాలపై మరొకరికి అవగాహన ఉండేది. ఆప్యాయతతో పలకరించడం, అవసరమైనప్పుడు తోడుగా నిలవడం, సమాజంలో భాగమనే భావనతో జీవించడం పల్లె జీవితానికి ప్రత్యేకమైన అందాన్ని ఇచ్చేవి. నాటి కచ్చిరి గద్దెలను యథాతథంగా తిరిగి తీసుకురావడం సాధ్యం కాకపోవచ్చు. కానీ వాటి వెనుక ఉన్న సామూహిక స్ఫూర్తిని నేటి గ్రామాల్లోనూ కొనసాగించవచ్చు. ప్రజలు కలుసుకునే బహిరంగ వేదికలను ఏర్పాటు చేయడం, గ్రామ చరిత్రను నమోదు చేయడం, పెద్దల అనుభవాలను యువతకు పరిచయం చేయడం, జానపద కథలు, పాటలు, సామెతలను భద్రపరచడం ద్వారా గ్రామీణ వారసత్వాన్ని భావితరాలకు అందించవచ్చు.

అందరూ సమానంగా కూర్చొని మాట్లాడుకునే, గ్రామ సమస్యలపై చర్చించే, యువతకు మార్గనిర్దేశం చేసే వేదికలు ఏర్పడితే సామాజిక ఐక్యత బలపడుతుంది. గతంలోని మంచి సంప్రదాయాలను స్వీకరిస్తూనే, వివక్షకు తావులేని సమానత్వ భావనతో ముందుకు సాగడం అవసరం.

కచ్చిరి గద్దె అంటే పాతకాలపు గ్రామంలో నిర్మించిన ఒక చిన్న వేదిక మాత్రమే కాదు. అది ఒక తరపు జీవనశైలి.నేడు కాలం మారింది. పల్లెలు మారాయి. జీవన విధానాలు మారాయి. చాలా గ్రామాల్లో కచ్చిరి గద్దెలు కనుమరుగయ్యాయి. అయినా వాటి చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు మాత్రం మనసుల్లో సజీవంగా ఉన్నాయి.

"గ్రామంలో ఏం జరిగినా గద్దె కాడకు వస్తే తెలుస్తుంది" అనే మాటలోనే నాటి పల్లె జీవనంలోని ఆత్మీయత, పరిచయం, సామూహికత దాగి ఉన్నాయి.

సాంకేతికత మనకు ప్రపంచాన్ని దగ్గర చేసినా, మన పక్కన ఉన్న మనిషితో మాట్లాడే అనుబంధాన్ని మనమే కాపాడుకోవాలి. ఎందుకంటే పల్లె గొప్పతనం దాని భవనాల్లోనో, రహదారుల్లోనో మాత్రమే లేదు.. మనుషుల మధ్య ఉండే ఆప్యాయత లోనూ ఉంది.కచ్చిరి గద్దె కనుమరుగై ఉండవచ్చు... కానీ అది పంచిన ముచ్చట్లు, పెంచిన అనుబంధాలు, మిగిల్చిన మధుర జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ చెరిగిపోవు.







-డా.పల్లె రవి వంశీ మోహన్
ఎడిటర్ & యండీ
అక్షరశక్తి



పట్టభద్రులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

అక్షరశక్తి, హన్మకొండ: అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకొని ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ 30వ డివిజన్ ఇన్‌చార్జి పెరుకారి శ్రీధర్‌రావు పిలుపునిచ్చారు. హన్మకొండలోని జితేందర్‌నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో ఆయన ఇంటింటికీ తిరుగుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమారు 50 మంది పట్టభద్రులను ఓటరు నమోదుకు చేర్పించారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం ప్రస్తుత నిబంధనల ప్రకారం మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని శ్రీధర్‌రావు కోరారు.

దక్షిణ జోన్ పోటీలకు కేయూ క్రీడాకారుల ఎంపిక


బెస్ట్ ఫిజిక్, వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో పోటీలు



అక్షరశక్తి, హనుమకొండ: దక్షిణ జోన్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల ఎంపికలను కాకతీయ విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ బోర్డు ప్రాంగణంలో నిర్వహించినట్లు స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి డాక్టర్ టి. శాస్త్రి తెలిపారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బెస్ట్ ఫిజిక్, మహిళల హెవీ వెయిట్ లిఫ్టింగ్, పురుషుల హెవీ వెయిట్ లిఫ్టింగ్ విభాగాల్లో ఈ ఎంపికలు చేపట్టారు. విశ్వవిద్యాలయ పరిధిలోని మూడు ఉమ్మడి జిల్లాల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. బెస్ట్ ఫిజిక్ విభాగంలో 15 మంది, మహిళల హెవీ వెయిట్ లిఫ్టింగ్‌లో 30 మంది, పురుషుల హెవీ వెయిట్ లిఫ్టింగ్‌లో 45 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కర్, డాక్టర్ కుమారస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు దక్షిణ జోన్ పోటీల్లో విశ్వవిద్యాలయం తరపున పాల్గొననున్నారు.

అనంతగిరి హిల్స్‌లో 'ది సాంగ్‌బర్డ్ బ్రేక్‌ఫాస్ట్'





అక్షరశక్తి, హైదరాబాద్: తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలోని డెక్కన్ వుడ్స్ అండ్ ట్రైల్స్ కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ సమీపంలోని అనంతగిరి హిల్స్‌లో 'ది బ్రీజ్' వేదికగా 'ది సాంగ్‌బర్డ్ బ్రేక్‌ఫాస్ట్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రకృతి ప్రేమికులు, పక్షుల పరిశీలకులు, ఫొటోగ్రాఫర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ కార్యక్రమంలో మార్గదర్శకులతో కలిసి పక్షులను వీక్షించే అవకాశం కల్పిస్తున్నారు. ఉదయం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు పక్షుల పరిశీలన యాత్ర నిర్వహించి, అనంతరం ప్రకృతి ఒడిలో అల్పాహారం అందిస్తారు. ఒక్కొక్కరికి రూ.699 రుసుముతో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఒక్కో విడతలో గరిష్ఠంగా 12 మంది పాల్గొనవచ్చు. పక్షుల సీజన్ జనవరి మొదటి వారం వరకు కొనసాగుతుందని అంచనా వేస్తున్నారు.

ఓటర్ల జాబితా అక్రమాలపై మూడవ దశ కార్యాచరణ ఖరారు

కాంగ్రెస్ నేతల సమన్వయ సమావేశం





అక్షరశక్తి, హనుమకొండ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాలో అక్రమాలపై నిరసనగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన 'ఓట్ బచావో-దేశ్ బచావో' ఉద్యమ మూడవ దశ కార్యాచరణను ఖరారు చేశారు. ఏఐసీసీ పిలుపు, టీపీసీసీ ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా కాంగ్రెస్ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధ్యక్షతన జిల్లా ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో సమన్వయ సమావేశం, మీడియా సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ పరిశీలకుడు కేబీఆర్ నాయుడు, టీపీసీసీ సమన్వయకర్త అరికెల నర్సారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేబీఆర్ నాయుడు, ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలోని అధికార పక్షం స్వార్థ ప్రయోజనాల కోసం ఓటర్ల జాబితా నుంచి అక్రమంగా ఓట్లను తొలగిస్తోందని, ఎన్నికల సంఘంపై ప్రభావం చూపేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థలో మార్పులు వచ్చే వరకు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దేశ ప్రజల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాడుతున్నారని, భవిష్యత్తులో ఆయనే ప్రధానమంత్రి అవుతారని కేబీఆర్ నాయుడు ధీమా వ్యక్తం చేశారు.

ఉద్యమంలో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, బూత్ స్థాయి ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించనున్నట్లు నేతలు తెలిపారు. బూత్ ఏజెంట్లు, స్వచ్ఛంద కార్యకర్తలకు ఏఐసీసీకి చెందిన 'ఓట్ రక్షక్' వేదిక వినియోగంపై శిక్షణ ఇచ్చి, అక్రమంగా తొలగించిన లేదా మార్చిన ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు. సంబంధిత వివరాలతో సంతకాలతో కూడిన నివేదికలు రూపొందిస్తామని చెప్పారు. గ్రామాల్లో ఓటర్లు, గ్రామ పెద్దలు, యువకులు, పంచాయతీ ప్రతినిధులతో 'గ్రామ చౌపాల్' సమావేశాలు నిర్వహించి ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగే జాతీయ ర్యాలీతో పాటు, నవంబర్ 25, 26 తేదీల్లో నిర్వహించనున్న 'ఢిల్లీ చలో' కార్యక్రమానికి జిల్లా నుంచి మద్దతు తెలుపుతామని నాయకులు వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు కె.ఆర్. నాగరాజు, రేవూరి ప్రకాశ్ రెడ్డి, టీపీసీసీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, కుడా చైర్మన్ గుండు సుధారాణి, సంగ వెంకట్రాజం, బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, దొమ్మటి సాంబయ్య, కూచన రవళి, భట్టి శ్రీనివాస్ రావు, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు ఎండీ అయ్యూబ్, పులి ప్రియాంక, సాగరిక రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలి

- **హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**



అక్షరశక్తి, హన్మకొండ : ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన అర్జీల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని త్వరగా పరిష్కరించాలన్నారు. ఆ యా శాఖలకు సంబంధించిన ప్రజావాణి అర్జీలను పెండింగ్ లో ఉండకుండా పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి 303 అర్జీలు అందాయి. ఇందులో హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో 150 అర్జీలు అందగా, ఆర్డీవో కార్యాలయాల్లో 16, ఎంపీడీవో కార్యాలయాల్లో 137 అర్జీలను అధికారులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ప్రతి శాఖలోని ఉద్యోగులకు మీప్రమాణం (MeePramanam) యాప్ ద్వారా ముఖ గుర్తింపు ఆధారిత హాజరు వ్యవస్థను అమలు చేయాలన్నారు. ఈ వ్యవస్థలో ఉద్యోగులు కార్యాలయ పరిధిలో మొబైల్ ద్వారా రోజువారీ హాజరు నమోదు చేయాలన్నారు. జిల్లాకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణత కలిగిన ప్రతి ఉద్యోగి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లాలోని పలు గ్రామాలలో భూముల రీ సర్వే జరుగుతుందని, సాగునీటి పారుదల, పంచాయతీరాజ్, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన భూముల రికార్డులు, వివరాలతో సంబంధిత శాఖల అధికారులు రీసర్వే ద్వారా ధ్రువీకరణ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంఘాల ఏర్పాటును ప్రోత్సహించొద్దు..

టాప్రా జిల్లా అధ్యక్షుడు వేణు



అక్షరశక్తి, హన్మకొండ(వడ్డేపల్లి): సంఘాల సంఖ్య పెరిగిపోవడంతో వివిధ సంఘాలు చేస్తున్న విజ్ఞప్తులను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని టాప్రా హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పరికిపండ్ల వేణు అన్నారు. ఆదివారం జవహర్ కాలనీలోని ఎస్‌వీ హోమ్స్ కమ్యూనిటీ హాల్‌లో మాడిశెట్టి శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన టాప్రా ఎన్జీవోస్ కాలనీ యూనిట్ అత్యవసర సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా)కు రాజీనామా చేసి కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న కొందరు, రెండు సంఘాలు ఒక్కటేనంటూ సభ్యత్వాలు, విరాళాల కోసం ఇంటింటికీ వెళ్తున్నారని తెలిపారు. సభ్యులు అప్రమత్తంగా ఉండాలని, కొత్త సంఘాల ఏర్పాటుకు ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ ప్రోత్సాహం ఇవ్వొద్దని సూచించారు. గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య మాట్లాడుతూ సంఘానికి లెక్కలు చెప్పకుండా రాజీనామా చేసి కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న వారి విషయంలో సభ్యులు జాగ్రత్తగా ఉండాలని అన్నారు. అనంతరం సభ్యులంతా టాప్రాలోనే కొనసాగుతామని ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో జిల్లా బాధ్యుడు కొత్త కనకయ్య, యూనిట్ ప్రధాన కార్యదర్శి సుధీర్ రెడ్డి, ఆర్థిక కార్యదర్శి సోమయ్య, కొమురయ్య, వెంకటేశ్వర్లు, నరసింహమూర్తి, మునీరుద్దీన్, బిక్షపతి, రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

GUEST COLUMN

ప్రజాస్వామ్యానికి అద్దం పట్టాల్సిన మీడియా..

వ్యాపారానికి బానిసైందా?



- డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
9849328496
ramkishore.1504@gmail.com

పత్రికా స్వేచ్ఛ, సాంకేతిక విప్లవం, పెయిడ్ న్యూస్, ప్రభుత్వ ఆంక్షలు, నైతిక పతనం.. మార్పు కోసం సమగ్ర సంస్కరణలు అవసరం

పత్రికా రంగం పుట్టుక..

ప్రజా చైతన్యానికి పునాది:

ప్రజాస్వామ్యంలో ప్రజల కళ్లుగా, చెవులుగా, అధికార దుర్వినియోగాన్ని ప్రశ్నించే శక్తిగా పత్రికా రంగాన్ని అభివర్ణిస్తారు. ప్రజలకు సమాచారం అందించడం మాత్రమే కాదు, పాలకుల నిర్ణయాలను విశ్లేషించడం, అవినీతిని వెలుగులోకి తీసుకురావడం, అణగారిన వర్గాల గొంతుకగా నిలవడం కూడా దాని బాధ్యతలు. అందుకే పత్రికా స్వేచ్ఛను ప్రజాస్వామ్యానికి ప్రాణాధారంగా పరిగణిస్తారు. అయితే నేడు మీడియా తన ప్రాథమిక లక్ష్యాల నుంచి పక్కకు తప్పుకుంటూ, వ్యాపార ప్రయోజనాలకు, రాజకీయ అధికారానికి అనుకూలంగా పనిచేస్తున్నదనే విమర్శలు పెరుగుతున్నాయి. ఈ పరిణామాలను అర్థం చేసుకోవాలంటే పత్రికా రంగం ప్రయాణాన్ని, దాని మీద పడుతున్న ఆర్థిక, రాజకీయ, సాంకేతిక ప్రభావాలను సమగ్రంగా పరిశీలించాలి.

ప్రపంచవ్యాప్తంగా ముద్రణా సాంకేతికత అభివృద్ధి చెందడంతో వార్తాపత్రికలు సమాచార ప్రసారానికి కీలక సాధనాలుగా మారాయి. భారతదేశంలోనూ పత్రికలు కేవలం వార్తలను అందించే మాధ్యమాలుగా కాకుండా, సామాజిక సంస్కరణలకు, జాతీయోద్యమానికి, స్వాతంత్ర్య పోరాటానికి దోహదపడిన వేదికలుగా ఎదిగాయి. కులవివక్ష, అంటరానితనం, మహిళలపై వివక్ష, వలస పాలకుల దోపిడీ వంటి అంశాలపై ప్రజలను చైతన్యపరిచాయి. అనేక మంది సంపాదకులు, పాత్రికేయులు అధికారుల ఆగ్రహాన్ని, నిర్బంధాలను ఎదుర్కొంటూ ప్రజల పక్షాన నిలిచారు. అప్పట్లో పత్రిక నిర్వహణ ఒక వ్యాపారం మాత్రమే కాదు, సామాజిక బాధ్యతగా కూడా భావించబడేది.

స్వేచ్ఛ నుంచి వాణిజ్యీకరణ వైపు:

స్వాతంత్ర్యం అనంతరం పత్రికా రంగం విస్తరించింది. ప్రాంతీయ భాషల్లో పత్రికలు పెరిగాయి. అక్షరాస్యత, పట్టణీకరణ, రవాణా, ముద్రణా సాంకేతికత అభివృద్ధితో వార్తలు మరింత విస్తృత ప్రజానీకానికి చేరాయి. రేడియో, తరువాత టెలివిజన్ రాకతో సమాచార ప్రసారానికి కొత్త మార్గాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా ప్రైవేటు టెలివిజన్ ఛానళ్ల విస్తరణ వార్తా రంగాన్ని వేగంగా మార్చింది.

అయితే ఈ విస్తరణతోపాటు వ్యాపార పోటీ కూడా పెరిగింది. పాఠకులు, ప్రేక్షకుల సంఖ్యను పెంచుకోవడం, ప్రకటనల ఆదాయాన్ని సంపాదించడం, మార్కెట్‌లో ఆధిపత్యాన్ని సాధించడం మీడియా సంస్థల ప్రధాన లక్ష్యాలుగా మారాయి. ప్రజా ప్రయోజనాల కంటే లాభాలకు ప్రాధాన్యం పెరిగినప్పుడు జర్నలిజం స్వరూపం మారడం సహజం. వార్త విలువను దాని సామాజిక ప్రాముఖ్యతతో కాకుండా, అది ఎంత సంచలనం సృష్టిస్తుంది, ఎంత మంది చూస్తారు, ఎంత ఆదాయం తెస్తుంది అనే ప్రమాణాలతో కొలవడం ప్రమాదకరమైన పోకడ.

పెయిడ్ న్యూస్.. వార్త ముసుగులో వ్యాపారం:

ఈ వాణిజ్యీకరణకు అత్యంత ప్రమాదకరమైన రూపం పెయిడ్ న్యూస్. డబ్బు లేదా ఇతర ప్రయోజనాలు తీసుకొని ప్రకటనను వార్తగా ప్రచురించడం, రాజకీయ నాయకుల ప్రతిష్ఠను పెంచే కథనాలను సంపాదకీయ విశ్లేషణల ముసుగులో ప్రసారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంది. ప్రకటనకు, వార్తకు మధ్య ఉండాల్సిన స్పష్టమైన విభజన చెరిగిపోతుంది. ముఖ్యంగా ఎన్నికల సమయంలో అభ్యర్థులకు అనుకూలంగా ప్రచారం చేయడం, ప్రత్యర్థులపై ప్రతికూల కథనాలను ప్రసారం చేయడం ఓటర్ల నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చు.

ప్రజాస్వామ్యంలో ఓటరుకు అభ్యర్థుల పనితీరు, విధానాలు, ఆర్థిక వ్యవహారాలు, ప్రజా సమస్యలపై నిష్పక్షపాత సమాచారం అందాలి. కానీ డబ్బు చెల్లించినవారికి అనుకూలమైన ప్రచారం లభిస్తే, ఆర్థికంగా బలహీనమైన అభ్యర్థులకు సమాన అవకాశాలు దెబ్బతింటాయి. అంతేకాదు, ప్రజలు వార్తగా నమ్మిన అంశం వాస్తవానికి చెల్లింపు ప్రచారమని తెలియకపోతే, సమాచారంపై వారి విశ్వాసం దుర్వినియోగమవుతుంది. కాబట్టి పెయిడ్ న్యూస్‌ను సాధారణ వాణిజ్య ప్రకటనగా చూడలేం. అది ఓటరు సమాచార హక్కుకు, ఎన్నికల సమానత్వానికి సంబంధించిన తీవ్రమైన సమస్య.

యాజమాన్య ప్రయోజనాలు..

సంపాదకీయ స్వేచ్ఛకు సంకెళ్లు:

మీడియా స్వాతంత్ర్యానికి మరో పెద్ద సవాలు యాజమాన్య కేంద్రీకరణ. ఒకే వ్యాపార సమూహం అనేక పత్రికలు, టెలివిజన్ ఛానళ్లు, డిజిటల్ వేదికలను నియంత్రించినప్పుడు వార్తల వైవిధ్యం తగ్గే ప్రమాదం ఉంది. యాజమాన్యానికి ఇతర వ్యాపారాల్లో ఉన్న ప్రయోజనాలు, రాజకీయ సంబంధాలు సంపాదకీయ నిర్ణయాలను ప్రభావితం చేయవచ్చు. ప్రభుత్వ విధానాలపై విమర్శనాత్మక కథనాలు ప్రచురిస్తే వ్యాపార ప్రయోజనాలకు నష్టం కలుగుతుందనే భయంతో కొన్ని సంస్థలు కీలకమైన వార్తలను పక్కనపెట్టే అవకాశం ఉంది.

ఇక్కడ సమస్య యజమానులు ఉండటంలో కాదు; యాజమాన్య ప్రయోజనాలు ప్రజల సమాచార హక్కును అధిగమించడంలో ఉంది. జర్నలిస్టుకు వృత్తిపరమైన స్వేచ్ఛ లేకుండా, ప్రతి కథనానికీ రాజకీయ లేదా వ్యాపార అనుమతి అవసరమయ్యే పరిస్థితి ఏర్పడితే, పరిశోధనాత్మక జర్నలిజం బలహీనపడుతుంది. పార్టీలకు అనుబంధంగా పనిచేసే మీడియా సంస్థలు పెరిగినప్పుడు ప్రజలకు వార్తలు అందడం కంటే రాజకీయ ప్రచారమే ఎక్కువగా అందుతుంది. వార్త, అభిప్రాయం, ప్రచారం మధ్య తేడా గుర్తించడం కష్టమవుతుంది.

ప్రభుత్వ ఆంక్షలు..

విమర్శను శత్రుత్వంగా చూడటమా?

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం మీడియాను ప్రశ్నలకు అతీతంగా భావించకూడదు. ప్రజాధనం ఎలా ఖర్చవుతోంది, సంక్షేమ పథకాలు ఎంతవరకు అమలవుతున్నాయి, ప్రభుత్వ నిర్ణయాల వల్ల ఎవరికి లాభం, ఎవరికి నష్టం జరుగుతోంది అనే ప్రశ్నలకు సమాధానాలు కోరడం పాత్రికేయుల విధి. అయితే విమర్శనాత్మక కథనాలను ప్రభుత్వ వ్యతిరేకతగా చిత్రించడం, జర్నలిస్టులపై చట్టపరమైన చర్యలను ఒత్తిడి సాధనంగా ఉపయోగించడం, ప్రభుత్వ ప్రకటనల పంపిణీలో వివక్ష చూపడం వంటి పరిణామాలు పత్రికా స్వేచ్ఛను బలహీనపరుస్తాయి.

అదే సమయంలో పత్రికా స్వేచ్ఛ అంటే చట్టాలకు అతీతమైన అధికారం కాదు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ప్రచురించడం, పరువు నష్టం కలిగించడం, వ్యక్తిగత గోప్యతను ఉల్లంఘించడం వంటి అంశాలకు చట్టబద్ధమైన బాధ్యత ఉంటుంది. అయితే అలాంటి చర్యలపై స్పందన నిష్పాక్షికంగా, న్యాయబద్ధంగా ఉండాలి. విమర్శను అణచివేయడానికి చట్టాన్ని ఉపయోగించడం, నిజమైన తప్పిదాలకు జవాబుదారీతనం కోరడం రెండింటినీ ఒకటిగా చూడకూడదు. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి అసలు పరీక్ష తనను ప్రశ్నించేవారిని ఎంత సహనంతో ఎదుర్కొంటుందన్నదే.

సాంకేతిక విప్లవం..

సమాచారం వేగం, నిజం వెనుకబాటు:

ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు వార్తా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. ఒకప్పుడు వార్త ప్రచురించడానికి పత్రికా కార్యాలయం, ముద్రణా యంత్రం అవసరమైతే, ఇప్పుడు ఒక వ్యక్తి కూడా ప్రపంచవ్యాప్తంగా సమాచారాన్ని పంచుకోగలుగుతున్నాడు. ప్రత్యక్ష ప్రసారాలు, పౌర జర్నలిజం, డిజిటల్ వార్తా వేదికలు అణగారిన వర్గాలకు తమ సమస్యలను వినిపించే అవకాశాలను పెంచాయి. ప్రభుత్వాల తప్పిదాలను ప్రజలు స్వయంగా రికార్డు చేసి బయటపెట్టగలుగుతున్నారు. కానీ ఇదే సాంకేతికత తప్పుడు సమాచారానికి కూడా విస్తృత మార్గాన్ని కల్పించింది. ధృవీకరించని వార్తలు, పాత వీడియోలను కొత్త సంఘటనలుగా చూపించడం, మార్ఫింగ్ చేసిన చిత్రాలు, కృత్రిమ మేధస్సుతో రూపొందించిన నకిలీ దృశ్యాలు క్షణాల్లో వ్యాపిస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రధాన మీడియా కూడా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన అంశాలను తగిన పరిశీలన లేకుండా ప్రసారం చేస్తోంది. వేగంగా వార్త ఇవ్వాలనే పోటీలో నిజ నిర్ధారణ వెనుకబడితే, సాంకేతిక పురోగతి ప్రజలకు సాధికారత కల్పించడానికి బదులుగా గందరగోళాన్ని సృష్టిస్తుంది.

టీఆర్పీల వేట.. నైతిక విలువలకు విఘాతం:

టెలివిజన్ వార్తల్లో అరుపులు, వ్యక్తిగత దూషణలు, ఆధారాలకంటే ఆరోపణలకు ప్రాధాన్యం, మత పరమైన ఉద్రిక్తతలను పెంచే చర్చలు పెరగడం ఆందోళనకరం. క్లిష్టమైన సమస్యలను పరిశోధించి వివరించడానికి సమయం కేటాయించాల్సిన మీడియా, కొన్నిసార్లు వివాదాలను వినోదాత్మక కార్యక్రమాలుగా మారుస్తోంది. బాధితుల గోప్యత, నిందితుల హక్కులు, సామాజిక సామరస్యం వంటి విలువలు కూడా సంచలనాత్మకత ముందు బలహీనపడుతున్నాయి.

జర్నలిజంలో తప్పులు జరగవచ్చు. అయితే వాటిని సరిదిద్దే నిజాయితీ, తప్పును అంగీకరించే ధైర్యం, వార్తకు ఆధారాలు చూపించే నిబద్ధత అత్యవసరం. ఒక వార్త తప్పని తేలినప్పుడు అదే ప్రాధాన్యంతో దిద్దుబాటు ప్రచురించకపోవడం విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. పాత్రికేయుడిని కేవలం ఉద్యోగిగా మార్చే పని పరిస్థితులు, తక్కువ వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం, రాజకీయ లేదా యాజమాన్య ఒత్తిళ్లు కూడా వృత్తి నైతికతపై ప్రభావం చూపుతాయి. అందువల్ల నైతిక పతనానికి వ్యక్తులే కారణమని చెప్పడం సరిపోదు; దానికి దారితీసే సంస్థాగత పరిస్థితులను కూడా మార్చాలి.

పరిష్కార మార్గం.. స్వేచ్ఛతోపాటు బాధ్యత:

పత్రికా రంగం విశ్వసనీయతను పునరుద్ధరించడానికి కొన్ని కీలకమైన మార్పులు అవసరం. మొదటగా, మీడియా సంస్థలు తమ యాజమాన్య నిర్మాణం, ప్రధాన పెట్టుబడిదారులు, ప్రయోజన సంఘర్షణలు, ప్రకటనల ప్రభావం వంటి అంశాలను పారదర్శకంగా వెల్లడించాలి. చెల్లింపు ప్రచారాన్ని వార్త నుంచి స్పష్టంగా వేరు చేసి గుర్తించాలి. ఎన్నికల సమయంలో రాజకీయ ప్రకటనల వివరాలు, వాటికి సంబంధించిన చెల్లింపులపై పారదర్శకత ఉండాలి. రెండవది, సంపాదకీయ స్వేచ్ఛను రక్షించే అంతర్గత విధానాలు రూపొందించాలి. యాజమాన్య నిర్ణయాలు, సంపాదకీయ నిర్ణయాల మధ్య స్పష్టమైన విభజన ఉండాలి. జర్నలిస్టులపై బెదిరింపులు, అన్యాయమైన తొలగింపులు, ప్రతీకార చర్యలను ఎదుర్కొనే ఫిర్యాదు వ్యవస్థలు బలోపేతం కావాలి. మూడవది, ప్రభుత్వ ప్రకటనల పంపిణీ స్పష్టమైన, కొలవగల ప్రమాణాల ఆధారంగా జరగాలి. ప్రభుత్వాన్ని విమర్శించిందనే కారణంతో ఒక సంస్థను శిక్షించడం, అనుకూలంగా వ్యవహరించిందనే కారణంతో మరొక సంస్థకు ప్రత్యేక ప్రయోజనం కల్పించడం నివారించాలి.

నాలుగవది, పత్రికా మండలి వంటి స్వీయ నియంత్రణ వ్యవస్థలు మరింత ప్రభావవంతంగా పనిచేయాలి. తప్పుదారి పట్టించే వార్తలపై వేగవంతమైన విచారణ, పారదర్శక నిర్ణయాలు, తప్పనిసరిగా కనిపించే దిద్దుబాట్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. సామాజిక మాధ్యమాల విషయంలో తప్పుడు సమాచారాన్ని అరికట్టే చర్యలు అవసరమే అయినా, అవి ప్రభుత్వానికి విమర్శలను తొలగించే ఆయుధాలుగా మారకుండా స్వతంత్ర పర్యవేక్షణ, అప్పీల్ అవకాశం, న్యాయపరమైన రక్షణ ఉండాలి. చివరగా, ప్రజల్లో మీడియా అక్షరాస్యతను పెంపొందించాలి. ఒక వార్తను వెంటనే నమ్మడం లేదా పంచుకోవడం కాకుండా, దాని మూలం ఏమిటి, ఆధారాలు ఉన్నాయా, ఇతర విశ్వసనీయ సంస్థలు కూడా అదే విషయాన్ని నిర్ధారించాయా అని పరిశీలించే అలవాటు పెరగాలి. జర్నలిజం విద్యలో వృత్తి నైతికత, సమాచార ధృవీకరణ, డిజిటల్ భద్రత, కృత్రిమ మేధస్సు వినియోగంపై ప్రత్యేక శిక్షణ అవసరం.

పత్రికా స్వేచ్ఛను కాపాడటం అంటే మీడియా సంస్థల ప్రయోజనాలను కాపాడటం మాత్రమే కాదు; ప్రజల నిజం తెలుసుకునే హక్కును రక్షించడం. మీడియా ప్రభుత్వానికి ప్రచార సాధనంగా మారినా, కార్పొరేట్ లాభాల కోసం పనిచేసినా, సంచలనాల వ్యాపారంలో మునిగిపోయినా నష్టపోయేది ప్రజాస్వామ్యమే. స్వేచ్ఛ లేని మీడియా అధికారానికి బానిసవుతుంది; బాధ్యత లేని మీడియా అసత్యాలకు వేదికవుతుంది. కాబట్టి స్వాతంత్ర్యం, నిష్పాక్షికత, పారదర్శకత, జవాబుదారీతనం అనే నాలుగు సూత్రాల సమతుల్యతే ఆరోగ్యకరమైన జర్నలిజానికి పునాది. ప్రజల పక్షాన నిలబడి అధికారాన్ని ప్రశ్నించినప్పుడే పత్రికా రంగం తన చారిత్రక పాత్రను నిలబెట్టుకోగలదు. లేకపోతే ప్రజాస్వామ్యానికి వెలుగునివ్వాల్సిన దీపమే చీకటిని పెంచే సాధనంగా మారుతుంది.

Printer, Publisher by Palle Ravi Vamshi Mohan on behalf M/s Creative Media Group by Printed at Ramani Web Offset Printers H.No. 8-82/11/1, Autonagar, Bommakal Village, Mdl&Dist: Karimnagar-505001. T.S. Published at H.No. 2-1-14, Saraswathi Nagar, Vidyaranyapuri, Mdl: Hanamkonda, Dist: Warangal-506009. T.S. Editor: Dr PR Vamshimohan.